## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: ఊబలంక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అదనంగా 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ పనుల నిమిత్తం సోమవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ ఆదివారం తెలిపారు. ఊబలంక, రావులపాలెంలోని అంకాలమ్మ గుడి ప్రాంతాలకు సరఫరా ఉండదని అన్నారు.

### వైభవంగా అష్టోత్తర కలశ పూజ



సామూహిక శతకలశ పూజలో మహిళలు

మామిడికుదురు: లూటుకుర్రు బోణం మెరకలో కొలువు దీరిన గ్రామ దేవత శ్రీపళ్లాలమ్మ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి ఆదివారం అష్టోత్తర శత కలశ పూజ ఘనంగా నిర్వహించారు. వేదమంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ ఈ పూజా కార్యక్రమం ఆద్యంతం కనుల పండువగా జరిగింది. అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, వివిధ పుష్ప, ఫలార్చనలు ఘనంగా జరిపించారు. పలు రకాల మిఠాయిలు, వంటకాలతో మహా నివేదన సమర్పించారు. పూజ్యం జగన్నాథశర్మ ఆధ్వర్యంలో శ్రీగణపతి, మహాకాళీ, మహాలక్ష్మి, మహా సరస్వతి, ఆదిమూల శాంతి హోమాలు, పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పలు రకాల బెంగళూరు పుష్పాలతో అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

### చిన్నారి వైద్యానికి చేయూత



అంబాజీపేటలో చిన్నారిని పలకరిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

అంబాజీపేట: ఓ చిన్నారికి నీడ్స్ ఫౌండేషన్ చేయూత అందించింది. స్థానిక కొర్లపాటివారిపాలేనికి చెందిన పెంటా హాసీల (5) ఊపిరితిత్తులలో నీరు పట్టడం వల్ల తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. ఆపరేషన్‌కు రూ.4 లక్షలు అవుతుందని స్థానిక గణపతి హోటల్‌కు చెందిన నంద గణపతి తన స్నేహితుడు చీకట్ల కిరణ్ కుమార్ ద్వారా నీడ్ ఫౌండేషన్‌కు తెలిపారు. దాంతో ఆ ఫౌండేషన్ నుంచి రూ.15 వేలను ఆదివారం అందించారు. ఫౌండేషన్ సభ్యులు కిలపర్తి చైతన్య, సూర్య అప్పారి, వెంకటేష్ చిటికెన, కంచిపల్లి లింగేశ్వరరావు, చీకట్ల కిరణ్‌కుమార్, ఆర్‌కే నాయుడు ఆకుల పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి సాయం

పి.గన్నవరం: ముంగండలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన చప్పిడి వెంకటరత్నం కుటుంబానికి ఎంపీపీ అంబటి భూలక్ష్మి ఆదివారం బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. నాయకులు పెచ్చెట్టి వెర్రియ్య, నేలపూడి దుర్గారావు, బొడ్డు సతీష్, ముక్కామల సూరిబాబు, ముక్కామల కృష్ణప్ప, సరెళ్ల గణపతి తదితరులు పాల్గొన్నారు.

### వాహన రాకపోకల పునరుద్ధరణ



పాశర్లపూడిలంకలో అడ్డంకులను తొలగించిన సర్పంచ్ ప్రకాశరావు, గ్రామ పెద్దలు

మామిడికుదురు: పాశర్లపూడిలంక రత్నానగర్‌లో 23 ఓఎన్జీసీ బావి వద్ద ఏడాదిగా నిలిపివేసిన ఓఎన్జీసీ వాహనాల రాకపోకలు ఎట్టకేలకు ఆదివారం పునరుద్ధరణకు నోచుకున్నాయి. స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం పైభాగంలో శ్లాబ్ వేయాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. దాని పరిష్కారానికి హామీ ఇచ్చిన ఓఎన్జీసీ అధికారులు అమలు చేయకపోవడంతో ఆ సంస్థ వాహనాలను అడ్డుకుని ఏడాది నుంచి నిరసన తెలియజేస్తున్నారు. ఎట్టకేలకు దిగి వచ్చిన ఓఎన్జీసీ అధికారులు శ్లాబ్‌కు అయ్యే మొత్తాన్ని నగదు రూపేణా ఇవ్వడంతో సమస్య పరిష్కారమైంది. దీంతో వాహన రాకపోకలను అడ్డుకుంటూ ఏర్పాటు చేసిన అడ్డంకులను ప్రజలు తొలగించారు. సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, పెద్దలు పాలమూరి సత్తిపండు, భయ్యా రామారావు, గుత్తుల కృష్ణమూర్తి, అంబేడ్కర్ యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### దుకాణాల బంద్

పి.గన్నవరం: స్థానిక కిరాణా వ్యాపారి తమ్మన నారాయణమూర్తి ఆకస్మిక మృతికి సంతాపంగా ఆదివారం ఉదయం గ్రామంలో దుకాణాలను మూసివేశారు. ఆయన మృతికి వర్తక సంఘ నాయకులు, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు సంతాపం తెలిపారు.


### గది.. దిగబడి



మాచవరం అంగన్‌వాడీ కేంద్రంలోని ఓ గదిలో దిగబడిన ఫ్లోరింగ్

అంబాజీపేట: భూకంపం కాదది.. గత పాలకుల హయాంలో చేపట్టిన పని అది. మాచవరం ప్రాథమిక పాఠశాల సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సుమారు 20 ఏళ్ల కిందట నిర్మించారు. ఈ కేంద్రానికి వచ్చే పౌష్టికాహారం, రికార్డులు, వంట సామగ్రి భద్రపరిచే గది ఫ్లోరింగ్ ఒక్కసారిగా దిగబడింది. ఆ గదిలో ఒక అగాథంలా మారింది. దానిని తక్షణమే పూడ్చాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### ట్రాన్స్‌కో.. పట్టించుకో..



చిరతపూడిలో ప్రమాదకరంగా ఉన్న ఫ్యూజ్ క్యారియర్

అంబాజీపేట: విద్యుత్తు వినియోగం ఎంత అవసరమో.. నిర్లక్ష్యంగా ఉంటే అంతే ప్రమాదం.. చిరతపూడి ప్రధాన రహదారిలో సొసైటీ ఎదురుగా విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన ఫ్యూజ్ క్యారియర్‌ను నిర్లక్ష్యంగా వదిలేశారు. రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో చేతికందే ఎత్తులో ఈ ఫ్యూజ్ క్యారియర్ ఉంది. ఎటువంటి భద్రత లేకుండా దర్శనమిస్తుంది. తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

### బురద.. అడుగేస్తే వ్యథ



వర్షానికి అధ్వానంగా మారిన కొర్లగుంట పంచాయతీ రోడ్డు

మామిడికుదురు: వర్షం తెచ్చిన వ్యథ ఇది. ఆదివారం కురిసిన వర్షానికి మామిడికుదురు శివారు కొర్లగుంట పంచాయతీ రోడ్డు బురదమయంగా మారింది. సుమారు కిలోమీటరు మేర రోడ్డును ఇటీవల పంచాయతీ నిధులతో అభివృద్ధి చేశారు. గ్రావెల్ వేసి దానిపై చిప్స్ వేయడంతో ఆదివారం కురిసిన అకాల వర్షానికి గ్రావెల్ రోడ్డుపై నీరు నిలిచిపోయింది. ఆ రోడ్డు కాస్తా బురదమయంగా మారింది. అధికారులు ఈ రోడ్డును ఆధునీకరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆశలు ఆవరి



మామిడికుదురులో తడిసిన పనలు

- అకాల వర్షంతో ఇబ్బంది
- తడిసి ముద్దయిన వరి పంట
- ఆందోళన చెందుతున్న రైతన్నలు

మామిడికుదురు/అంబాజీపేట/మలికిపురం/పి.గన్నవరం/అయినవిల్లి/ఆలమూరు: అంతా బాగుంది.. ఆరుగాలం శ్రమించిన కష్టం చేతికొస్తుంది.. సిరులు కురిపిస్తోంది.. అనుకుంటున్న సమయంలో అకాల వర్షం రైతుల ఆశలను ఆవిరి చేసింది.. పుడమి పుత్రులకు కష్టాన్ని తెచ్చింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో కొత్తపేట డివిజన్ వ్యాప్తంగా ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట నియోజకవర్గాల్లో ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షం పడింది. మామిడికుదురు మండలంలో 2,957 ఎకరాల విస్తీర్ణంలో దాళ్వా పంటను రైతులు సాగు చేశారు. ఇక్కడ 1,200 ఎకరాల విస్తీర్ణంలో కోతలు పూర్తయ్యాయి. ఆ పంట కొంత పనలపై, మరికొంత కోత కోసి కుప్పలుగా ఉంది. 400 ఎకరాల్లో పంట కోత దశకు వచ్చింది. 98 ఎకరాల్లో పంట పనలపై ఉంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో కురిసిన అకాల వర్షం వరి పంటకు నష్టం కలిగించింది. పనలపై ఉన్న పంటతో పాటు కుప్పలుగా వేసిన పనలు తడిసిపోయాయి. దీంతో పాటు ఈ వర్షం ఇటుక బట్టీలకు తీరని నష్టాన్ని కలిగించిందని నిర్వాహకులు తెలిపారు.

**విరిగిన స్తంభాలు.. కాలిన టీవీలు**

రాజోలు నియోజకవర్గంలో పిడుగులు, ఈదురు గాలుల కారణంగా విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం సంభవించింది. మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో సుమారు 15 చోట్ల కొబ్బరి చెట్లు పడి విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. మలికిపురం మండలంలో ఏడు చోట్ల 12 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్లూ దెబ్బతిన్నారు. మలికిపురం విద్యుత్ శాఖ ఏఈ మద్దూరి సతీష్ ఆధ్వర్యంలో సిబ్బంది సుమారు 4 గంటల పాటు శ్రమించి విద్యుత్‌ను పునరుద్ధరించారు. సకాలంలో పనులు పూర్తిచేసిన సిబ్బందిని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అభినందించారు. వర్షాలకు దెబ్బతిన్న స్తంభాలను ఆయన పరిశీలించారు. మరమ్మతులు త్వరితగతిన జరిగేలా ఎమ్మెల్యే పర్యవేక్షించారు.

**జాగ్రత్తలు అవసరం**

పది రోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిన ప్రజలకు చల్లబడిన వాతావరణం కాస్త ఉపశమనాన్ని కలిగించింది. ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు చెబుతున్నారు. భిన్న వాతావరణంతో వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు పాటించాలంటున్నారు. భారీ వర్షానికి చిరు వ్యాపారులు, పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు వీధుల్లో రహదారులు జలమయం అయ్యాయి.

రాజోలు: అకాల వర్షంతో రాజోలు మండలం శివకోడు, రాజోలు, కూనవరం, కడలి తదితర గ్రామాల్లోని వరి పంట నేల వాలింది. కొందరు కోతలు ముగించుకుని తేమశాతం తగ్గించేందుకు ఆరబోసుకున్న ధాన్యం తడిసి ముద్దయింది. శివకోడు బైపాస్ రోడ్డులో ఆరబెట్టుకున్న ధాన్యం తడిసిపోవడంతో రైతులు దానిని రక్షించుకునేందుకు బరకాలు కప్పారు. కూనవరంలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆర్డీఓ వసంతరాయుడు పరిశీలించారు. తడిసిన వరి పనలను రైతులు ఆర్డీఓకు చూపించారు. ధాన్యం సంరక్షించే విధంగా రైతులకు అండగా ఉండాలని రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులకు ఆయన సూచించారు. తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు పాల్గొన్నారు.

పి.గన్నవరం: మండలంలో కురిసిన వర్షానికి కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిసి పోవడంతో రైతులు ఆందోళన చెందారు. ధాన్యం రంగు మారుతుందని వారు ఆవేదన చేస్తున్నారు. బట్టీల వద్ద ఆరబెట్టిన ఇటుకలు వర్షానికి తడిసిపోయాయి.

అకాల వర్షానికి అయినవిల్లి మండలం నల్లచెరువు, నేదునూరు తదితర గ్రామాల్లో తడిసిన ధాన్యం రాశులను ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వెంకటేష్ పరిశీలించారు. అలాగే నేదునూరు, నల్లచెరువు, ఎస్.పెదపాలెం తదితర గ్రామాల్లో 426 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయని మండల ఏఓ వై.శోభ తెలిపారు. వర్షానికి వరి పనలు తడిచాయన్నారు. 100 ఎకరాలకు చెందిన ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయన్నారు. ఆలమూరు మండలంలో 11 వేల ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఇప్పటికే వరి కోత యంత్రాల ద్వారా మాసూళ్లు చేసిన ధాన్యాన్ని ఆరబెట్టే పనిలో ఉన్న రైతులకు వర్షం అశనిపాతంలా మారింది. అనేక మంది రైతుల ధాన్యం రాశులు ఆరుబయట ఉండటంతో తడిచి ముద్దయ్యాయి. మండలంలో కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి పర్యటించి రైతుల కష్టాలు తెలుసుకున్నారు. ప్రతి ధాన్యపు గింజను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ పాల్గొన్నారు.



మలికిపురంలో విద్యుత్ లైన్‌పై పడిన కొబ్బరి చెట్టు



చింతలమోరిలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు



కూనవరంలో తడిసిన వరి పనలను ఆర్డీఓకు చూపిస్తున్న రైతులు



జి.పెదపూడిలో ధాన్యం బస్తాలపై బరకాలు కప్పుతున్న రైతులు



నల్లచెరువులో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వెంకటేష్

# పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

అంబాజీపేట: దళారుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర కల్పిస్తామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చెప్పారు. ముక్కామల, ఇరుసుమండ సొసైటీల వద్ద చైర్ పర్సన్లు వాసంశెట్టి రాంబాబు, నాగాబత్తుల సత్యానందం అధ్యక్షతన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ధాన్యం సొమ్ముతో పాటు గోనె సంచులు, కూలీలు, రవాణా చార్జీలను 21 రోజుల్లో రైతుల ఖాతాలో జమ చేస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు బుడితి సత్యనారాయణమ్మ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు, బండారు మల్లి, వాసంశెట్టి పెదబాబు, చింతపల్లి వెంకటేశ్వరరావు, గుబ్బల నాగమహేష్ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఇరుసుమండ త్రిసభ్య కమిటీ సభ్యుడిగా దొమ్మేటి రాధా సూర్యనారాయణ ప్రమాణ స్వీకారాన్ని ఎమ్మెల్యే చిట్టిబాబు చేయించారు.

**ధాన్యం రవాణాకు వాహనాల ఏర్పాటు**

మామిడికుదురు: కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు అవసరమైన రవాణా సదుపాయం కల్పిస్తామని ఆర్డీఓ వసంతరాయుడు చెప్పారు. మామిడికుదురు శివారు ఈర్లచెరువులో ఆయన పర్యటించారు. అక్కడి రైతులతో మాట్లాడారు. ధాన్యం రవాణాకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని రైతులు వాపోయారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని, పనలపై ఉన్న పంటను సంరక్షించుకునేందుకు ఉప్పునీటిని పిచికారీ చేయాలని సూచించారు. తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, డీఎస్ఓ ఎం.పాపారావు, ఎంఎస్ఓ దేవళ్ల శ్రీనివాసరావు, ఆర్ఐ అలీ పాల్గొన్నారు.

కొత్తపేట: రైతులు పండించిన ధాన్యాన్ని ఆర్‌బీకే ద్వారా విక్రయించి మద్దతు ధర పొందాలని అవిడి సర్పంచ్ రెడ్డి చంటి తెలిపారు. అవిడిలో ధాన్యం కొనుగోలును ఆయన ప్రారంభించారు. గ్రామంలో వరి కోతలు ప్రారంభం కాగా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా ఓ రైతుకు చెందిన 135.6 క్వింటాళ్ల ధాన్యాన్ని పట్టుబడి పట్టారు. ఆ ధాన్యాన్ని ట్రక్‌షీట్ జనరేట్ చేయించి రైతుకు అందజేశారు. సంబంధిత ధాన్యం లారీని సర్పంచ్ రెడ్డి చంటి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి నామాడి రాజారత్నం జెండా ఊపి పి.గన్నవరం మండలం గంటి పెదపూడి రైస్‌మిల్లుకు తరలించారు. వీఆర్‌ఓ అంజూరి శ్రీనివాస్, వీఏఏ గోపాలం తదితరులు పాల్గొన్నారు.



ముక్కామల సొసైటీ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



అవిడిలో ధాన్యం లారీని మిల్లుకు తరలిస్తున్న సర్పంచ్ చంటి, రాజారత్నం

# ప్రజల ఆశీస్సులే వైఎస్సార్ సీపీకి బలం

ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అంబాజీపేట: ప్రజల ఆశీస్సులే వైఎస్సార్ సీపీకి బలమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఆదివారం మాచవరం సచివాలయం-3లో పార్టీ మండల శాఖ ప్రధాన కార్యదర్శి నాగవరపు నాగరాజు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, నాయకులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కలసి ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రతి ఇంటికీ వెళ్లి పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. నాలుగేళ్ల నుంచి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకునేందుకే గడప గడపకూ వచ్చినట్లు వివరించారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. గ్రామంలో రహదారులు, డ్రైనేజీలు నిర్మించాలని, హౌసింగ్ రుణాలు, ఇళ్ల స్థలాలు ఇప్పించాలని ఎమ్మెల్యేను కాలనీ వాసులు కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. ఎంపీటీసీ సభ్యురాలు మట్టా పార్వతి, వాసంశెట్టి చినబాబు, కుసుమ శ్రీను, నందెపు సూరిబాబు, పెచ్చెట్టి శ్రీనివాస్, కొర్లపాటి కోటబాబు, కుసుమ వరలక్ష్మి, ర్యాలి శ్రీనివాస్ వడయార్, కుడుపూడి సత్తిబాబు, విత్తనాల శేఖర్, మట్టపర్తి హరి తదితరులు పాల్గొన్నారు.



మాచవరంలో లబ్ధిదారులకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

# రైతులను ఇబ్బంది పెట్టొద్దు

జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

ఆత్రేయపురం: అకాల వర్షంతో తడిచిన ధాన్యం విషయంలో రైతులను ఇబ్బంది పెట్టవద్దని ధాన్యం కొనుగోలు సిబ్బందికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం లొల్ల, ఆత్రేయపురం గ్రామాల్లో వర్షానికి తడిచిన ధాన్యం రాశులను ఆయన పరిశీలించారు. ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి ఆదుకోవాలని, నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. మిల్లర్లు ఆన్‌లైన్ కావడం లేదని ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. దీనిపై ఆయన స్పందించి కళ్లంలో పట్టి ఉన్న ధాన్యం తరలించాలని ధాన్యం కొనుగోలు సిబ్బందికి సూచించారు. అలాగే వాహనాలు, ఆన్‌లైన్ టార్గెట్‌లో ఇబ్బందులు గమనించి వాటిని పరిష్కరించారు. తడిచిన ధాన్యంపై 5 శాతం ఉప్పు ద్రావణం అంటే 5 కిలోల ఉప్పును పది లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసి ఆరబెడితే మొలక రాకుండా, రంగు మారకుండా ఉంటుందన్నారు. ఏఓ పట్టాభిరామయ్య మాట్లాడుతూ మండలంలో సుమారు 1,500 ఎకరాల్లో వరి కోతలు పూర్తయినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ 700 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే 83310 56542ను సంప్రదించాలని అన్నారు. వీఏ మణికంఠ వర్మ తదితరులు పాల్గొన్నారు.



రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు

# ఘనంగా తిరునక్షత్ర ఉత్సవాలు

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి శ్రీమద్రామానుజుల తిరునక్షత్ర ఉత్సవాలను ఆదివారం నిర్వహించారు. స్వామివారికి ప్రబంధ పారాయణ, ఆలయంలో ప్రదక్షిణ, సేవాకాలం తదితర పూజలు జరిపారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణం జరిగింది. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌రాజు, ఈఓ సత్యనారాయణరాజు పర్యవేక్షించారు.



వాడపల్లిలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

# చురుగ్గా ఫీవర్ సర్వే

ఆలమూరు: పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వే చురుగ్గా జరుగుతుంది. మండలంలోని వివిధ గ్రామాల్లో కోవిడ్-19 అనుమానిత కేసులు నమోదు అవుతుండడంతో వైద్యారోగ్య అప్రమత్తమైంది. వైద్యాధికారి పి.భవానీశంకర్ నేతృత్వంలో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వర లక్షణాలను ఉన్న వారిని గుర్తించి వివరాలు నమోదు చేసుకుని ట్యాబ్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ఆదివారం కూడా ఈ సర్వే నిర్వహించారు.

### పల్లిపాలెంలో వైద్య శిబిరం

సఖినేటిపల్లి: పల్లిపాలెంలో జనసేన నాయకుడు డాక్టర్ రాపాక రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీనిని ఆ పార్టీ రాష్ట్ర మత్స్యకార విభాగ అధ్యక్షుడు బొమ్మిడి నాయకర్, అమలాపురం పార్లమెంటరీ పార్టీ ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్ ప్రారంభించారు. వివిధ వ్యాధులకు పరీక్షలు చేశారు. దంత వైద్యుడు దొడ్డా సాయి ప్రసాద్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీటీసీ బైర నాగరాజు, నాయకులు బొంతు రాజేశ్వరరావు, గుబ్బల ఫణికుమార్ పాల్గొన్నారు.

### యువత ఔదార్యం



బాధిత కుటుంబానికి సాయం చేస్తున్న యువ శెట్టిబలిజ సంఘ సభ్యులు

కొత్తపేట: మండల యువ శెట్టిబలిజ సంఘం తన ఔదార్యాన్ని చాటుకుంది. మందపల్లి గ్రామానికి చెందిన కొంబత్తుల భవాని(26) పక్షవాతానికి గురైంది. ఆమెకు మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. పుట్టుకతో మూగ, చిన్న వయసులోనే ఆమె అనారోగ్యానికి గురవడంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న యువ శెట్టిబలిజ సంఘం సభ్యులు తమ వంతుగా రూ.10 వేల సాయం అందజేశారు. సంఘ అధ్యక్షుడు బొక్కా ప్రసాద్, సెక్రటరీ శీలం కొండబాబు, ఖండ్రిగ ఉప సర్పంచ్ కడలి పార్థసారధి, కోశాధికారి మామిడిశెట్టి బాలాజీ, జాయింట్ సెక్రటరీ కడలి భీమా, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముషిణి వెంకటరమణ, దంగేటి సాయి తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు పనులు ప్రారంభం

పి.గన్నవరం: నాగుల్లంక గ్రామంలో రూ.4 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ అంబటి భూలక్ష్మి ఆదివారం ప్రారంభించారు. సర్పంచ్ యల్లమెల్లి కృష్ణవేణి, ఎంపీటీసీ సభ్యులు పాలూరి వీరభద్రరావు, కారుపల్లి సునీత తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ మేధావి అంబేడ్కర్



కొండుకుదురులంకలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు



కొమరాడలో విజేతలకు బహుమతులు అందిస్తున్న సత్తిబాబు, భీమారావు

ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావి అని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఆదివారం కొండుకుదురులంకలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ అంబేడ్కర్ దేశ ప్రజలకు ప్రసాదించిన వరం రాజ్యాంగం అని అన్నారు. కార్యక్రమంలో జనిపల్లి భీమారావు, పుణ్యమంతుల రజనీ, కొనే చంద్రశేఖర్, పంతాడి రాంబాబు, పెట్టా జగన్, మట్టపర్తి రామారావు, శీలం సత్యనారాయణ ఉన్నారు.

అంబాజీపేట: అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని విజయవాడ డీసీపీ మోకా సత్తిబాబు అన్నారు. జ్యోతీరావు పూలే, అంబేడ్కర్ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్‌లో సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎంపవర్‌మెంట్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మోకా రమాదేవి సౌజన్యంతో ఏపీ పోలీస్ కానిస్టేబుల్స్, ఎస్సై ప్రిలిమ్స్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి శిక్షణ పొందుతున్న 120 మంది అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌ను అందించారు. జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ కోట బేబిరాణి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

**ముందు తరాలకు అందిద్దాం..**

మామిడికుదురు: అంబేడ్కర్ ఆశయాలను ముందు తరాలకు అందిద్దామని విజయవాడ డిప్యూటీ పోలీస్ కమిషనర్ మోకా సత్తిబాబు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఎంఏకే భీమారావు అన్నారు. కొమరాడ గౌతమ్‌నగర్‌లో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల సభకు రిటైర్డ్ హెచ్‌ఎం చింతా భాస్కరరావు అధ్యక్షత వహించారు. అంబేడ్కర్ టాలెంట్ టెస్టులో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పెద్దలు పాల్గొన్నారు.

# మళ్లీ జగనన్నకే పట్టం

మలికిపురం: ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొడవటి దొరబాబు అన్నారు. ఆదివారం లక్కవరంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలుపై అభిప్రాయాలు సేకరించారు. ప్రజా స్పందనను నమోదు చేసుకున్నారు. దొరబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాలనపై ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారన్నారు. చింతా రాజబాబు, ఆచంట కృష్ణ, కొల్లాబత్తుల అశోక్, బత్తుల చిన్ని పాల్గొన్నారు.



లక్కవరంలో పథకాలపై ప్రజలకు వివరిస్తున్న కొడవటి దొరబాబు